రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

- సచివాలయ ప్రథమ వార్షికోత్సవం స్ఫూర్తిదాయకం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి





వేల్పులలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి , విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి

వేముల : రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేల్పుల గ్రామంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సచివాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత వైఎస్ మధురెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, ఉపసర్పంచ్ లింగాల పార్వతమ్మలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేల్పులలోని సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో అభినందనీయమని మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డిని ప్రశంసించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకుంటున్నారన్నారు. అమ్మ ఒడి మొదలుకొని పింఛన్ల వరకు అన్ని సంక్షేమ పథకాల అమలుతో సీఎం వైఎస్ జగన్ పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. సచివాలయ భవన సముదాయం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. వారం రోజులుగా మండలాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాస రచన పోటీలు, సచివాలయ సిబ్బందికి కబడ్డీ, క్రికెట్ వంటి ఆటలు నిర్వహించి అక్కడ గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, ఉపసర్పంచ్ లింగాల పార్వతమ్మలు శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్‌జాన్, సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రూ.5.30 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ

వేల్పుల గ్రామంలో రూ.5.30కోట్ల మేర అభివృద్ధి పనులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా గ్రామ సమీపంలో రూ.18.89 లక్షలతో నిర్మించిన స్టేడియం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడే సమీపంలో రూ.82.80లక్షలతో నిర్మించిన హిందూ, బీసీ, ఎస్సీ శ్మశాన వాటికలను ప్రారంభించారు. అక్కడి నుంచి గ్రామం వద్ద రూ.64 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, కల్వర్టులను ప్రారంభించారు. అలాగే గ్రామ మండల సమాఖ్య కార్యాలయాన్ని, రూ.7లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.15.74 లక్షలతో నిర్మించిన మహిళా డెయిరీని ప్రారంభించారు. అలాగే విద్యార్థులతో కలిసి ప్లే గ్రౌండ్‌ను ప్రారంభించి, అక్కడ సమీపంలో రూ.30లక్షలతో నిర్మించిన మసీదును ప్రారంభించారు. అక్కడ మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే అక్కడే సమీపంలో మొక్కలు నాటారు. అక్కడి నుంచి మెయిన్ రోడ్డుకు చేరుకుని వేల్పుల-సిద్ధంరెడ్డి పల్లె గ్రామాల మధ్య రూ.3కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అక్కడ నుంచి కాలినడకన బయలుదేరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కవాతు, చిన్నారులు చేసిన కోలాటంతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్‌జాన్, సొసైటీ అధ్యక్షులు మాధవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డిలు నగదు బహుమతితో పాటు మెమెంటోలు ప్రదానం చేశారు. మహిళల విభాగంలో కబడ్డీలో విన్నర్స్‌గా వేముల, రన్నర్స్‌గా వేంపల్లె, టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా వేంపల్లె, రన్నర్స్‌గా చక్రాయపేట, క్యారమ్స్‌లో వేంపల్లె మండలానికి చెందిన గౌరి, హిమబిందు విన్నర్స్‌గా, వేముల మండలానికి చెందిన రాజేశ్వరి, అనూష రన్నర్స్‌గా నిలిచారు.

అలాగే స్పోర్ట్సు విభాగంలో మహిళల 100 మీటర్ల పరుగు పందెంలో లింగాలకు చెందిన మాధవీలత మొదటిస్థానంలోనూ, వేంపల్లెకు చెందిన చంద్రమౌనిక రెండవ స్థానంలోనూ, వేములకు చెందిన శ్రీదేవి తృతీయ స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ విభాగంలో వేములకు చెందిన శ్రీదేవి మొదటి స్థానంలోనూ, హారిక రెండవ స్థానంలోనూ, రామకుమారి తృతీయస్థానం పొందారు. స్కిప్పింగ్ విభాగంలో వేంపల్లెకు చెందిన రుచిత మొదటి స్థానం, వేంపల్లెకు చెందిన సుధారాణి రెండవ స్థానం, హిమబిందు తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో వాలీబాల్‌లో సింహాద్రిపురం మండలం విన్నర్స్ కాగా వేంపల్లె మండలం రన్నర్స్‌గా నిలిచారు. అలాగే కబడ్డీ పోటీలో వేంపల్లె మండలం విన్నర్స్ కాగా, వేముల మండలం రన్నర్స్‌గా నిలిచారు. క్రికెట్‌లో వేంపల్లె మండలం విన్నర్స్ కాగా వేముల జట్టు రన్నర్స్‌గా నిలిచింది. క్యారమ్స్‌లో చక్రాయపేట మండలం విన్నర్స్‌గా, వేముల రన్నర్స్‌గా నిలిచింది. స్పోర్ట్సు విభాగంలో ఎస్.శివశంకర్ మొదటి స్థానంలో, గంగాధర ద్వితీయ స్థానంలో, చక్రాయపేటకు చెందిన ముబారక్ తృతీయ స్థానంలో నిలిచారు. షాట్‌పుట్‌లో సింహాద్రిపురానికి చెందిన బాబు మొదటి స్థానంలో, వేములకు చెందిన జయంత్ ద్వితీయ స్థానం, లింగాలకు చెందిన వెంకటేశ్వర రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కొండపేటలో బలరామ పౌర్ణమి ఉత్సవాలు

చెన్నూరు : చెన్నూరు మండలం కొండపేట గ్రామంలో వెలసిన అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం, ఇస్కాన్ ఆధ్వర్యంలో గురువారం బలరామ పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొండపేట గ్రామంలోని ఇస్కాన్ భజన మందిరంలో మంగళహారతి, భజన, కీర్తన, కథ నిర్వహిస్తారు. అలాగే శంఖాభిషేకం, పుష్పాభిషేకం, పంచహారతి ఏర్పాటు చేశారు. బలరామకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి కొండపేట పురవీధుల గుండా బలరామకృష్ణులతో కూడిన ఉత్సవ విగ్రహాలను నగర సంకీర్తన మధ్య ఊరేగించనున్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఎర్రగుంట్ల : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 17వ రౌండు సామాజిక తనిఖీ కార్యక్రమం గురువారం ఎంపీడీఓ సభా భవనంలో జరుగుతుందని ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని దేవరాజుపల్లెకు చెందిన రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం హాజరు కానున్నారని మండల తహసీల్దార్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. భూ హక్కు పత్రాలు పొందిన రైతులు సమావేశానికి హాజరై తమ పత్రాలు పొందాలని ఆమె కోరారు.

మానవీయ విలువలకు ప్రతీక రక్షాబంధన్



సీఐ, ఎస్‌ఐలకు రాఖీలు కడుతున్న ఓంశాంతి నిర్వాహకులు

ఎర్రగుంట్ల : ఆత్మరక్షణకు, విజయానికి గుర్తుగా శ్రావణ మాసంలో శ్రావణ పౌర్ణమి నాడు రాఖీ పండుగను జరుపుకుంటారని, మానవీయ విలువలకు ప్రతీక రక్షా బంధన్ అని ఆర్టీపీపీ ఓంశాంతి భవన్ నిర్వాహకులు బీకే సౌజన్య తెలిపారు. రాఖీ పండుగను పురస్కరించుకుని బుధవారం కొండాపురం సీఐ సుదర్శన్‌ప్రసాద్, కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డిలకు రాఖీలు కట్టారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న మానవత సంస్థ సభ్యులు

చెన్నూరు : మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. చెన్నూరు శ్రీరామ్ నగర్‌కు చెందిన గోపయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా మానవత సేవా సంస్థ సభ్యులైన ఆవుల బసిరెడ్డి, ఆటోబాబులు కలసి గోపయ్య మృతదేహానికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

సరుకుల రవాణాకు టెండర్ల ఆహ్వానం

జమ్మలమడుగు : మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన నిత్యావసర వస్తువులు సరఫరా చేయడం కోసం ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకోవాలని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని జమ్మలమడుగు, కమలాపురం, తొండూరు, వేంపల్లి మండలాలతో పాటు వనిపెంటలో ఉన్న గురుకుల పాఠశాలలకు 2023-24 విద్యా సంవత్సరానికి టెండర్లు వేయదలచిన వారు జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు. లేదా 9885466501 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఎంపీని సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు

తొండూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితుడైన తొండూరు మండలానికి చెందిన ఊడవగండ్ల శశికాంత్ రెడ్డి బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కలిసి సన్మానించారు. అలాగే తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, రాష్ట్ర వైద్య విభాగపు ప్రధాన కార్యదర్శి వైఎస్ అభిషేక్ రెడ్డిలను కూడా సత్కరించారు. ఈ పదవికి ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు హాల్ గంగాధర రెడ్డి, సైదాపురం సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్న దేవగుడి కుటుంబం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు : నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించి తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందాలని దేవగుడి కుటుంబీకులు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, ధీరజ్‌రెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులు శుభ్రంగా ఉండరంటూ వారిని హేళనగా మాట్లాడితే టీడీపీ అధినాయకుడు చంద్రబాబు మాత్రం ఎవరైనా దళితులుగా పుట్టాలని అనుకుంటారా అని అవమానకరంగా మాట్లాడారన్నారు. మంగళవారం టీడీపీ నాయకుడు భూపేష్‌రెడ్డి దళితులపై దాడులు చేయించడం సరైంది కాదన్నారు. గత నాలుగేళ్లుగా జమ్మలమడుగు నియోజకవర్గంలో కనీసం చిన్న గొడవ కూడా లేకుండ పరిపాలన సాగుతోందన్నారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితిలో త్వరలో ఎన్నికలు రానుండటంతో తమ ఉనికిని చాటుకోవడం కోసం గ్రామాలలో ఫ్యాక్షన్ రాజకీయాలు నడిపి ప్రజల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తిరిగి టీడీపీ నాయకులు ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తే కనీసం డిపాజిట్లు కూడా రావన్న సంగతి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో దుద్యాల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, ఆకుల బాబా పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పాడా కార్యాలయంలో పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లె, సింహాద్రిపురం, చక్రాయపేట, తొండూరు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లకు పై బడిన అన్ని వయసుల వారిని క్రీడల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. అక్టోబర్ 2న ఈ పోటీలను రాష్ట్రస్థాయిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సీఎంఓ కార్యాలయ తహసీల్దార్ రామభూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో అధిక దిగుబడి



సమీకృత వ్యవసాయంపై వివరిస్తున్న వీరయ్య

వీరపునాయునిపల్లె : సమీకృత వ్యవసాయం పాటించడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వీరయ్య అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో నీటి యాజమాన్య సంస్థ ఆర్థిక సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రంవారు రైతులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి రెండవ రోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమీకృత వ్యవసాయంతో వర్షాధారంగా రెండు పంటలు పండిస్తూ ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ చీనీ, నిమ్మ, ఇతర ఉద్యానవన పంటలలో ఎదురయ్యే చీడ పీడల యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సాయి మహేశ్వరి, సేద్య విభాగపు శాస్త్రవేత్త సిద్దయ్య, నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి కళ్యాణి, మద్దిలేటి, రైతులు పాల్గొన్నారు.

వరుణ దేవుడు కరుణించాలి



గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కమలాపురం : వరుణ దేవుడు కరుణించాలని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధిలో వెలసిన శ్రీ గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101 టెంకాయలు కొట్టి వరుణ దేవుడు కరుణ చూపి వర్షాలు కురిపించాలని గంగమ్మ తల్లికి ప్రీతిపాత్రమైన నిమ్మకాలయలతో చేసిన మాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, కరువు కవల పిల్లలని, ఆయన 14 ఏళ్ల పాలనలో కరువు విలయ తాండవం చేసిందని గుర్తు చేశారు. మహానేత వైఎస్సార్ పాలనలో ప్రతి ఏడాది వర్షాలు కురిసేవన్నారు. ప్రస్తుత సీఎం, మహానేత తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో సైతం సకాలంలో వర్షాలు కురిసేవన్నారు. ఈ ఏడాది చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ చేసే పాదయాత్రల వల్ల వారి పాద మహిమతో వర్షాలు కరువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, నిఖిల్ రెడ్డి, అంబటి సురేష్, విజయేంద్రారెడ్డి, దాసరి సురేష్, మోనార్క్, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురాతన మసీదును అభివృద్ధి చేయాలని వినతి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామ శివారులో ఉన్న పురాతన మసీదును అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాకు వినతిపత్రం అందించారు. బుధవారం ఉప్పలూరు గ్రామ ముస్లింలు, దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దులు కడపలో ఆయనను కలిశారు. సుమారు 600 సంవత్సరాల చరిత్ర ఉన్న పురాతన మసీదుకు ప్రహరీ మంజూరుచేయాలని, అదేవిధంగా శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని కోరారు. మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాదుల్లా, మహబూబ్‌బాషా, దస్తగిరి, మహబూబ్‌బాషా, బాషా, రియాజ్, పీరయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సర్వరాయసాగర్ ప్రాజెక్టు లీకేజీల ద్వారా నష్ట పోయిన 94 మంది రైతులకు నష్ట పరిహారానికి సంబంధించి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మించిన ఏ ఒక్క ప్రాజెక్టు పరిధిలో లీకేజీల ద్వారా జరిగిన నష్టానికి నష్ట పరిహారం అందించలేదని తెలిపారు. సర్వరాయ సాగర్ ప్రాజెక్టు లీకేజీ ద్వారా 94మంది రైతులు నష్ట పోయిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించి రైతులను ఆదుకొనేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో నష్ట పరిహారం మంజూరైందని తెలిపారు. ప్రస్తుతం 94మంది రైతులకు గాను 66 మందికి మంజూరైందని మిగిలిన వారికి కూడా మంజూరు చేస్తామన్నారు. ఆర్డీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నష్ట పరిహారం మంజూరైన రైతులు జాబితాలో ఉన్న తమ బ్యాంకు ఖాతా సరిచూసుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బత్తాయికి ఎకరాకు రూ.8వేలు, అరటికి రూ.10వేలు, వ్యవసాయ భూమికి రూ.8వేలు చొప్పున పరిహారం మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, స్థానిక నాయకుడు విశ్వనాథరెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

చెన్నూరు : ప్రజారోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగుతోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తూ ప్రతి సచివాలయ పరిధిలో విలేజ్ క్లినిక్ ఏర్పాటుచేసి గ్రామీణ వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం పై ఇంతగా దృష్టి సారించలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌ఓ నాగరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఉప మండలాధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఆర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జీఎన్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్‌ఆర్, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీఓ సురేష్ బాబు, ఏఈలు మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



శివాలపల్లెలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నందిమండలం గ్రామ సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ రామమోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు లలిత, సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, జగన్‌మోహన్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు

పెద్దముడియం : మండలంలోని 12 గ్రామ సచివాలయాలకు వైఎస్సార్ పింఛన్ కానుక కింద 142 నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సచివాలయాల వారీగా భీమగుండం 7, చిన్నపసుపుల 11, గుండ్లకుంట 16, జె.కొత్తపల్లె 5, జంగాలపల్లె 16, కొండసుంకేసుల 26, ఎన్.కొట్టాలపల్లె 16, పెద్దముడియం 16, పాలూరు4, పెద్దపసుపుల 17, సుద్దపల్లె 8 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు.

డిప్యూటీ సీఎంకు వినతి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని రూట రాష్ట్ర ఉర్దూ లెక్చరర్ల వింగ్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసీవుల్ల బక్తియారిలు కోరారు. ఈ విషయమై బుధవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో, పాలిటెక్నిక్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల వయో పరిమితిని 58 నుంచి 60 సంవత్సరాలకు పెంచిన ప్రభుత్వం డిగ్రీ లెక్చరర్లకు పెంచకపోవడం బాధాకరం అన్నారు.

దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నీరు నిల్వ ఉన్న చోట అబేట్ పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

పులివెందుల రూరల్ : దోమకాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి జీవన్ కుమార్ అన్నారు. ఈ బుధవారం పట్టణ పరిధిలోని జయమ్మ కాలనీలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు వచ్చిన వెంటనే రక్తపరీక్షలు చేయించు కోవాలన్నారు. ఎయిర్ కూలర్‌లో నీటిని వారానికి ఒక్కసారి శుభ్రం చేయాలన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పని సరిగా డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను గుర్తించి టీం ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించే క్రీడాకారులలో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను గుర్తించి టీంగా ఏర్పాటు చేయాలని ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీం సభ్యులను గుర్తించడంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డి, పీఈటీ నాగార్జున, మున్సిపల్ ఏఈ సురేష్, ఏఎస్‌ఐ రాజారెడ్డి, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, మెప్మా సీఓ వసంత్, టీపీఓ వినోద్ పాల్గొన్నారు.

నష్టపోయిన వేరుశనగ రైతులను ఆదుకుంటాం

వేముల : వర్షాభావంతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో బుధవారం ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బయపురెడ్డిలతో కలిసి ఎండిన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో నల్లచెరువుపల్లె, కొవ్వూరు, పాలూరు, తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు సాగుచేసుకున్న వేరుశనగ పంట ఎండిపోయిందన్నారు. అధికారులతో పంట నష్టం అంచనా వేసి ప్రతి రైతుకు పరిహారం వచ్చేలా చూస్తామన్నారు. పాదయాత్ర పేరుతో లోకేష్, సాగునీటి ప్రాజెక్టులపై యుద్ధభేరి అంటూ చంద్రబాబు ఇక్కడ అడుగు పెట్టిన ఫలితంగానే పంట ఎండిపోయిందని ప్రజలే చర్చించుకుంటున్నారన్నారు.. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటనారాయణ, భైరవేశ్వర దేవస్థానం చైర్మన్ రామసిద్ధారెడ్డి,మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, జేడీఏ నాగేశ్వర రావు, ఏడీఏ అశోక్ రెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

పెండ్లిమర్రి : ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణమరాజు, రాష్ట్ర కన్సల్టెంట్ ఐబీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని పగడాలపల్లె గ్రామ సమీపంలో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ప్రతి రైతు ఏటీఎం మోడల్ పంటలను సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వారానికి 25 మంది రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వసంత కుమారి, ఎస్ఎఫ్ఎఫ్ సందీప్ కుమార్, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.